
కథ

# కొసమెరుపు

సి. ఎన్. చంద్రశేఖర్



''ఇరవై ఏళ్ళ తరువాత మనం మళ్ళీ కలవడం, అదీ మనం అనుకున్నట్లే కలవడం నాకెంతో సంతోషంగా ఉంది'' అన్నాడు విజయ్.

''నాకు మాత్రం థ్రిల్లింగ్‌గా ఉంది'' అన్నాడు రాజేష్. ''తొమ్మిది గంటలకు స్కూల్లో అడుగుపెట్టాను. గంటసేపట్నుంచి నువ్వు వస్తావో, రావో అన్న ఆలోచనతోనే గడిపాను. నువ్వు లోపలికి రాగానే వెంటనే గుర్తుపట్టాను. చిన్నప్పటి నీ ఫీచర్స్ యిప్పటికీ అలాగే ఉన్నాయి'' .

''నా పరిస్థితీ అదే. ట్రైనులో నీ గురించే ఆలోచిస్తూ వచ్చాను. స్కూల్లో అడుగుపెట్టగానే రావిచెట్టు కింద కూర్చున్న నువ్వు కనిపించావు. గడ్డం, మీసం పెంచుకున్నా నీ కళ్ళు, నీ చూపులు నాకింకా గుర్తే.''

రాజేష్ సిగరెట్ పెట్టి తీసి విజయ్ వైపు చేయి చాచాడు.

"నో థాంక్స్ అలవాటు లేదు"

"సో నువ్వింకా మాస్టర్ విజయ్‌వే నన్న మాట" అంటూ పెట్టెలోంచి ఓ సిగరెట్‌తీసి నోట్లో పెట్టుకుని వెలిగించుకున్నాడు రాజేష్.

"మీ నాన్నకు ట్రాన్స్‌ఫరై నువ్వు హైదరాబాదుకు వెళుతున్న రోజు నువ్వు నాతో చెప్పిన విషయం నేను మర్చిపోలేదు. బహుశ అప్పట్లో మనకు పాఠ్యాంశంగా వచ్చిన 'ఓ హెన్రీ' కథ, "ఆఫ్టర్ ట్వంటీ యియర్స్" నీకు స్ఫూర్తినిచ్చి ఉండవచ్చు. ప్రతి జనవరి ఫస్టున నీ గురించి ఆలోచించేవాడిని. నిన్ను కలవడానికి యింకా ఎన్నేళ్ళుందని లెక్కలు కట్టేవాణ్ణి. 'రాజేష్ ఎట్లున్నాడు, ఏ గ్రూపు తీసుకున్నాడు, ఏ కాలేజీలో చేరాడు. ఏ ఉద్యోగం చేస్తున్నాడు' అని ఆలోచించేవాడిని. చిన్ననాడు మనసులో నాటుకున్న విషయాలు కలకాలం గుర్తుండిపోతాయని అంటారు. అందుకే ఇరవై ఏళ్ళ తర్వాత బాపట్ల ప్రకాశం హైస్కూల్లో మనం కలవాలన్న నీ కోరిక, తప్పకుండా వస్తానన్న నా భరోసా నన్ను యింత దూరం ప్రయాణింపజేసింది" అన్నాడు విజయ్.

"ప్రతి జనవరి ఫస్టున నాకూ నువ్వు గుర్తొచ్చేవాడివి. నిజానికి నాకున్న బిజినెస్ కమిట్‌మెంట్స్ వల్ల యింతదూరం వచ్చే సమయం లేదు నాకు. అయితే నువ్వు వస్తావో రావో చూడాలన్న క్యూరియాసిటీ మాత్రమే నన్ను యిక్కడికి రప్పించింది." అన్నాడు రాజేష్.

"యు ఆర్ ఫ్రాంక్"

"యస్. ఐ యామ్ బ్రూటల్లీ ఫ్రాంక్. ఇంకో విషయం తెలుసా, అవసరం లేకున్నా కంపెనీ తరపున ఓ సేల్స్ మీటింగ్ విజయవాడలో ఏర్పాటు చేశాను. కనీసం అంతవరకూ టి.ఎ., డి.ఎలు వస్తాయన్న ఉద్దేశ్యంతో"

విజయ్ ఏం మాట్లాడలేదు. నిజానికి అతనికి అటువంటి పనులు నచ్చవు.

బతకడానికి డబ్బులు సంపాదించాలే గాని సంపాదనే ధ్యేయంగా బతకడం అతనికి యిష్టం ఉండదు. ముఖ్యంగా తమ స్వార్థం కోసం తమను పోషిస్తున్న కంపెనీని నష్టపరిచే వాళ్ళంటే అతనికి అసహ్యం.

"ఒకసారి క్లాసురూములన్నీ తిరిగి వద్దామా?" విజయ్ అడిగాడు.

"అలాగే"

ఇద్దరూ కలసి స్కూలంతా కలియతిరిగారు. తాము చదువుకున్న క్లాస్‌రూమ్‌ల దగ్గర ఆగి పాత సంఘటనలను నెమరు వేసుకున్నారు.

"మనం సెవెన్త్‌లో ఉన్నప్పుడు 'పుష్ప మేడమ్' అని ఓ సైన్స్ టీచరుండేది గుర్తుందా? భలే అందంగా ఉండేది. నేను తను అడిగిన ప్రశ్నలు తప్పుగా జవాబులు చెప్పినప్పుడల్లా నా బుగ్గలు గట్టిగా పిండేది. ఎందుకో నాకు నొప్పి అనిపించేది కాదు. ఆమె స్పర్శ మధురంగా అనిపించేది. అందుకే ఒక్కోసారి జవాబు తెలిసినా తప్పుగా చెప్పేవాణ్ణి" అన్నాడు రాజేష్.

"సెవెన్త్ నుంచే నువ్వు యువకుడైనావన్న మాట. ఈ విషయాలు అప్పుడు నాతో చెప్పలేదు నువ్వు" అన్నాడు విజయ్ నవ్వుతూ.

"నువ్వు సిన్సియర్ స్టూడెంట్‌వి కదా. అందుకే నీతో చెప్పడానికి భయపడ్డాను"

ఇద్దరూ మళ్ళీ రావిచెట్టు దగ్గరికి వచ్చి రాతి బండ మీద కూర్చున్నారు.

"ఇప్పుడు చెప్పు. నువ్వు ఎక్కడ ఉంటున్నావు? ఏం చేస్తున్నావు?" అని విజయ్ అడిగాడు.

"నేను ఎం.బి.ఎ. చేశాను. వైజాగ్‌లో సాఫ్ట్ డ్రింక్స్ తయారు చేసే కంపెనీలో ఫైనాన్స్ మేనేజరుగా ఉన్నాను."

"నువ్వు వైజాగ్ నుండి వస్తున్నావా?" ఆశ్చర్యంగా అడిగాడు విజయ్.



"ఎందుకంత ఆశ్చర్యం నీకు? కొంపదీసి నువ్వూ అక్కడ్నుంచే వస్తున్నావా?"

"అవును. నేను ఓ ఫార్మసూటికల్ కంపెనీలో డిస్ట్రిక్ట్ మేనేజరుగా వైజాగ్‌లోనే పని చేస్తున్నాను."

"ఈ విషయం ముందే తెలిసుంటే యిద్దరం కలసి వచ్చేవాళ్ళము"

"లేదు. 'ఎటూ వైజాగ్‌లో కలిశాం కనుక మళ్ళీ బాపట్ల వరకూ ఎందుకు' అనుకుని ఉండేవాళ్ళం. ఇలా విడివిడిగా వచ్చి ఇక్కడ కలుసుకోవడమే బాగుంది. ఈ సాకుతో మనం చదివిన స్కూలు, పెరిగిన ఊరు మళ్ళీ చూసే అవకాశం వచ్చింది. తిరిగి వెళ్ళేటప్పుడు కలసి వెళదాం."

అలాగేనన్నట్టు తలూపాడు రాజేష్.

"నీ పర్సనల్ లైఫ్ గురించి చెప్పు. ఎంతమంది పిల్లలు నీకు?" మళ్ళీ విజయ్ అడిగాడు.

"నాకింకా పెళ్ళే కాలేదు. పిల్లల గురించి ఏం చెప్పను?"

"ఎందుకు యింకా పెళ్ళి చేసుకోలేదు నువ్వు?"

"అవసరం అనిపించలేదు. పెళ్ళైన వాళ్ళకంటే ఎక్కువ ఆనందంగా ఉన్నాను.

అన్నీ అనుభవిస్తున్నాను. చాలదా?"

విజయ్ ఆ మాట నచ్చనట్టు ముఖం పెట్టాడు.

"నీ గురించి చెప్పు. నీ కెంత మంది భార్యలు? ఎంతమంది పిల్లలు?" రాజేష్ అడిగాడు నవ్వుతూ.

"పిల్లలు లేరు. భార్య యీ మధ్యే మరణించింది"

"మై గాడ్. ఎలా?"

"ఆత్మహత్య చేసుకుని"

"నేను నమ్మను. నీలాంటి మంచి వ్యక్తిని భార్యగా పొందిన ఏ స్త్రీ కూడా ఆత్మహత్య చేసుకోదు "

"నేను మంచివాణ్ణని ఎలా చెప్పగలవు? నువ్వు నన్ను చివరిసారిగా చూసింది నాకు పదమూడేళ్ళ వయస్సప్పుడు. ఈ ఇరవై ఏళ్ళూ నేను అలాగే ఉంటున్నానని ఎలా చెప్పగలవు?"

"ఫేస్ యీజ్ ఎన్ యిండెక్స్ ఆఫ్ మైండ్" అంటారు కదా. నీ ముఖంలో నిజాయితీ, అమాయకత్వం స్పష్టంగా కనబడుతూంది. దయచేసి

"నీ గురించి చెప్పు.
నీ కెంత మంది భార్యలు?
ఎంతమంది పిల్లలు?"
రాజేష్ అడిగాడు నవ్వుతూ.
"పిల్లలు లేరు. భార్య
యీ మధ్యే మరణించింది"
"మై గాడ్. ఎలా?"
"ఆత్మహత్య చేసుకుని"
"నేను నమ్మను. నీలాంటి మంచి
వ్యక్తిని భార్యగా పొందిన
ఏ స్త్రీ కూడా ఆత్మహత్య
చేసుకోదు "
"నేను మంచివాణ్ణని ఎలా
చెప్పగలవు? నువ్వు నన్ను
చివరిసారిగా చూసింది
నాకు పదమూడేళ్ళ
వయస్సప్పుడు. ఈ ఇరవై
ఏళ్ళూ నేను అలాగే
ఉంటున్నానని ఎలా
చెప్పగలవు?"

ఆమె ఎందుకు ఆత్మహత్య చేసుకుందో చెప్పు''

విజయ్ తలూపి కళ్ళు మూసుకుని గతం గుర్తు చేసుకోసాగాడు.

* * *

ఆ రోజు క్యాంపు నుంచి ఇంటికి వచ్చిన విజయ్‌కు ఇంటి ముందు నిలిపి ఉన్న మోటారు బైక్ కనిపించింది.

''ఎవరొచ్చారబ్బా'' అనుకుంటూ కాలింగ్ బెల్ నొక్కాడు. తలుపులు తెరచుకోలేదు. రెండు నిమిషాలు ఎదురు చూసి, 'సౌదామిని బయటికి వెళ్ళినట్లుంది' అనుకుని దగ్గరలోని మెడికల్ షాపు కెళ్ళి, కాసేపు ఆ షాపతనితో తన కంపెనీ మందుల అమ్మకం గురించి మాట్లాడి మళ్ళీ ఇంటికొచ్చాడు. ఇంటి తలుపు తెరచి ఉంది. బయట మోటర్‌బైక్ లేదు.

అతన్ని చూడగానే ''హాయ్'' అంటూ ఎదురొచ్చింది. సౌదామిని.

''ఇందాక వస్తే తలుపు వేసి ఉంది. ఎక్కడికెళ్ళావు?''

''టైలరింగ్ క్లాసుకెళ్ళాను. మీరు బయలుదేరే ముందు నాకు ఫోన్ చేసి ఉంటే నేను ఇంట్లోనే ఉండేదాన్ని కదా?''

''నువ్వు టైలరింగ్ క్లాసులకు వెళుతున్నట్లు నాకు తెలియదు కదా. ఈసారి నుంచి అలాగే ఫోన్ చేసి వస్తాను.'' అన్నాడు ఆమెను కౌగిలిలోకి తీసుకుంటూ.

అంతలో అతనికి ఇంటి బయట కనిపించిన మోటర్‌బైక్ గుర్తొచ్చింది. సౌదామినిని బైక్ సంగతి అడిగాడు.

''నేను చూడలేదే. నేను ఇంటికి వచ్చినప్పుడు బయట ఏ బైకూ కనిపించలేదు నాకు. ఎవరో నీడ కోసం పెట్టి ఉంటారు.

* * *

వారం రోజుల తర్వాత క్యాంపు నుంచి వచ్చిన విజయ్‌కు ఇంటి ముందు బైక్ మళ్ళీ కనిపించింది. అతను వీధి చివరనున్న టీ కొట్టుకెళ్ళి కాఫీ ఆర్డరిచ్చాడు. తన సెల్ నుంచి ఇంటికి ఫోన్ చేసి 'తను ఊరి నుంచి వచ్చానని, బస్టాండులో ఉన్నానని, మరో పది నిమిషాల్లో ఇంటికి వస్తానని' సౌదామినితో చెప్పాడు. కాఫీ కప్పు తీసుకుని రోడ్డు మీద నిలబడి తన ఇంటివైపే చూడసాగాడు. ఇంట్లోంచి ఓ మగ వ్యక్తి బయటకు రావడం చూసి షాక్ తిన్నవాడిలా నిలబడిపోయాడు. తను చూసింది నిజమా? కలా? సౌదామిని అటువంటి మనిషా? లేదు. తను చూసింది నిజం కాదు. సౌదామిని అటువంటి మనిషి కాదు. మనసా, వాచా తనకే అంకితమైన వ్యక్తి. విషయమేమిటో సౌదామినినే అడిగి తెలుసుకోవాలి' అనుకున్నాడు.

* * *

''ఇందాక మన ఇంట్లోంచి ఒక వ్యక్తి బయటకు రావడం చూశాను. ఎవరతను?'' సాధ్యమైనంత శాంతంగా అడిగాడు విజయ్.

''ఎవరూ రాలేదే'' వణికిపోతూ అంది సౌదామిని.

''నేను చూశాను సౌదామినీ. నాకు నీ మీద ఎటువంటి అనుమానం, అపనమ్మకం లేదు. అతనెవరో చెప్పు చాలు.''

ఆమె మాట్లాడ లేదు.

''చెప్పు సౌదామినీ. నేను చూసింది అబద్ధమని చెప్పు. నీకు పరాయి మగవాడితో పరిచయం లేదని, నీ మనసంతా నన్నే నింపుకున్నావని, నేను తప్ప యింకెవరూ అక్కరలేదని చెప్పు''.

''....''

అతనికి ఏడుపొస్తూంది. తను ప్రాణప్రదంగా చూసుకున్న భార్య... మోసం చేసిందన్న నిజం అతని గుండెను కోసేస్తూంది.

''నేను... నేను... నీకేం తక్కువ చేశాను''

''నా వల్ల నీకు సుఖం లేదా? కనీసం దీనికైనా సమాధానం చెప్పు''

ఆమె మాట్లాడలేదు. అతను అలాగే మంచంపై కూలబడి పోయాడు. సౌదామిని గోడ కానుకుని నిలబడి ఉంది. ఆమె చూపులు నిర్జీవంగా ఉన్నాయి. దాదాపు గంటసేపు యిద్దరూ అలాగే ఉండిపోయారు.

విజయ్ తటాలున లేచి నిలబడి ''నీకు అతనే కావాలనుకుంటే వెంటనే అతని దగ్గరికి వెళ్ళిపో. నేనంటే యిష్టం లేని వ్యక్తితో సంసారం చెయ్యలేను. ప్రేమ నటించే వాళ్ళంటే నాకసహ్యం'' అని వడివడిగా నడుస్తూ బయటకు వెళ్ళిపోయాడు.

* * *

ఇంటి నుంచి బయటకు వచ్చిన విజయ్ చాలాసేపు ఊర్లో తిరిగి బీచ్ వైపు నడిచాడు. ఇసుకలో కూర్చుని సముద్రం వైపే చూస్తూ గడిపాడు. ఆకలవుతున్నా ఇంటికి వెళ్ళాలని అనిపించలేదు అతనికి. అతని ఇంట్లోంచి ఓ మగ వ్యక్తి బయటకు వచ్చిన దృశ్యమే అతని కళ్ళముందు పదే పదే మెదుల్తూంది. 'తను చూసింది నిజమని యిప్పటికీ నమ్మలేకపోతున్నాడు. ఇంటికి వచ్చినవాడు తన స్నేహితుడని, అతనితో తనకు మరే విధమైన సంబంధం లేదని సౌదామిని చెప్పి ఉంటే నమ్మి ఉండేవాడు. ఆమె మౌనం తన గుండెల్లో మంటలు రేపింది'' అనుకున్నాడు.

రాత్రి పదకొండు గంటలవరకూ బీచ్‌లో కూర్చుని, తర్వాత లేచి ఇంటిదారి పట్టాడు. ఇంటి తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి. సౌదామిని ఇంట్లో కనిపించలేదు. 'తను చెప్పిందే చాలని అతని దగ్గరకు వెళ్ళిపోయిందా?' అనుకున్నాడు. ఆ ఆలోచన రాగానే అతనికి ఎంతో బాధేసింది.

బెడ్‌రూమ్ తలుపు తెరచి లోపలికి అడుగు పెట్టి, లైట్ స్విచ్ వేసి ఎదురుగా కనిపించిన దృశ్యాన్ని చూసి నిశ్చేష్టుడయ్యాడు. సౌదామిని ఫ్యానుకు వ్రేలాడుతూంది. దగ్గరకు వెళ్ళి చెయ్యి తాకి చూశాడు. చల్లగా తగిలింది చేయి.

విజయ్ కుప్పకూలిపోయాడు ఏడుస్తూ.

* * *

''ఐ యామ్ సారి. వెరి వెరి సారి'' రాజేష్ బాధగా అన్నాడు. విజయ్ కళ్ళు వర్షిస్తున్నాయి. ఏడుపు బలవంతాన ఆపుకుంటున్నాడు.

''కాని ఆవిడ ఆత్మహత్య చేసుకోవలసిన అవసరం నాకు కనిపించలేదు. ఎటూ విషయం నీకు తెలిసిపోయింది కనుక తన ప్రియుడి దగ్గరకు వెళ్ళిపోయి ఉండవచ్చు కదా'' అన్నాడు రాజేష్.

''నేను బయటకు వెళ్ళాక తన ప్రియుడికి ఫోన్ చేసి తను అతని దగ్గరకు వచ్చేస్తానని చెప్పి ఉంటుంది. అతను రావద్దని చెప్పి ఉంటాడు. అతని తిరస్కృతి, నన్ను మోసం చేశానన్న బాధ ఆమెను ఆత్మహత్యకు పురికొల్పి ఉండవచ్చు.''

''నువ్వు మళ్ళీ పెళ్లి చేసుకోలేదా?''

''చేసుకోవాలని అనిపించలేదు. మనుషులపై నమ్మకం పోయింది''

''కమాన్ విజయ్. మరీ పెసిమిస్టిక్‌లా మాట్లాడవద్దు. జీవితంలో కష్టాలు, బాధలూ ఉన్నట్లే సుఖాలూ, అనుభూతులు కూడా ఉన్నాయి. మనం వెతికి చేజిక్కించుకోవాలి''. అంటూ లేచి నిలబడి ''నేను కూల్‌డ్రింక్స్ తీసుకొస్తాను. తాగుతూ మాట్లాడుకుందాం'' అని బయటకు వెళ్ళి రెండు కూల్‌డ్రింక్స్ బాటిల్స్‌తో వచ్చాడు.

''మీ కంపెనీ కూల్ డ్రింక్సా?'' విజయ్ అడిగాడు.

''అరె. భలే ఊహించావే. నేను కూల్‌డ్రింక్స్ అమ్ముతాను. కాని హాట్ డ్రింక్స్ తాగుతాను.'' అన్నాడు రాజేష్ నవ్వుతూ.

''వీటితో బాటు బిస్కెట్లు కూడా తేలేకపోయావా? ఆకలి దంచేస్తూంది''

''దానికేం. మళ్ళీ వెళ్ళి తెస్తాను''.

బిస్కెట్ ప్యాకెట్లు తీసుకుని స్కూల్లోకి అడుగు పెడుతూ విజయ్‌ని చూసిన రాజేష్ కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. గుండె వేగంగా కొట్టుకోసాగింది.

విజయ్ తన జేబులోంచి ఓ పొట్లాన్ని తీసి అందులోని పొడిని ఓ కూల్‌డ్రింక్ బాటిల్‌లో వేస్తున్నాడు. ఆ పని పూర్తి కాగానే కాగితం మడచి దూరంగా పారవేసి, తన సంచిలోంచి వాటర్ బాటిల్ తీసి చేయి కడుక్కోసాగాడు.

'సో విజయ్ తనను సౌదామిని ప్రియుడుగా గుర్తు పట్టాడన్నమాట. అతను కూల్‌డ్రింక్‌లో ఏం కలిపాడు? విషమా? విషమే అయి ఉంటుంది. లేకుంటే అంత అర్జెంటుగా చేతులు శుభ్రం చేసుకోవాల్సిన అవసరం ఏం ఉంది?'' అనుకున్నాడు. రాజేష్ రావడం చూసిన విజయ్ గబుక్కున ఆ బాటిళ్ళకు అడ్డంగా అటుతిరిగి నిలబడి, బాటిళ్ళను చెరో చేత్తో పట్టుకుని, ఓ బాటిల్ రాజేష్‌కు అందించి ''కమాన్. హావ్ యిట్. ఆలస్యం అమృతం విషం'' అన్నాడు.

బాటిల్ అందుకుంటుంటే రాజేష్ చెయ్యి వణికింది. అంతలో చేతిలోని బిస్కట్ ప్యాకెట్ గుర్తొచ్చి ''ముందు బిస్కెట్ల పనిపడదాం. ఆకలిగా ఉందన్నావుగా'' అన్నాడు రాజేష్, కూల్‌డ్రింక్ తాగ

డాన్ని వాయిదా వేస్తూ...

"యు ఆర్ రైట్"

ఇంతలో విజయ్ జేబులో సెల్ మ్రోగింది.

"ఎక్స్యూజ్‌మీ. ఒక్క సెకండ్" అంటూ విజయ్ దూరంగా వెళ్ళి సెల్‌లో మాట్లాడసాగాడు. అతను మాట్లాడుతూ మరో వైపు తిరగగానే రాజేష్ కూల్ డ్రింక్స్ బాటిల్స్‌ని మార్చేశాడు.

□□□□□

"సారీ విజయ్. సౌదామిని ప్రియుణ్ణి నేనే. అయితే ఆమె నీ భార్య అని నాకు తెలియదు. విజయ్ కుమార్ అంటే ఎవరో అనుకున్నాను" ఇద్దరూ కూల్‌డ్రింక్స్ తాగాక చెప్పాడు రాజేష్.

విజయ్ నమ్మలేనట్టు చూశాడు రాజేష్ వైపు.

"సౌదామిని అమాయకురాలు విజయ్. తన పెళ్ళికి ముందు నన్ను ప్రేమించింది. నేనూ ప్రేమించినట్లు నటించాను. అప్పట్లో తను సన్నగా రివటలా ఉండేది. అందుకే నా టేస్ట్‌కు తగ్గ వ్యక్తి కాదని మధ్యలోనే పరిచయాన్ని తెంపేశాను. తన పెళ్ళయ్యాక ఓ రోజు బజార్లో కనబడింది. బాగా ఒళ్ళు చేసి చాలా అందంగా కనిపించింది. అంత అందాన్ని దూరం చేసుకున్నందుకు చాలా బాధపడ్డాను"

"ఓ స్నేహితుని భార్య గురించి నువ్విలా మాట్లాడటం బాగాలేదు" బాధగా అన్నాడు విజయ్.

"స్నేహితుడా? నువ్వా?" అంటూ నవ్వి" ఆ సంగతి తర్వాత మాట్లాడుదాం. బజారులో సౌదామినిని చూసిన నేను ఆమెను ఫాలో అయి మీ ఇల్లు కనుక్కున్నాను. తరచుగా ఆమెను కలసి నాతో ప్రణయం సాగించాలని, లేకుంటే ఆమె రాసిన ప్రేమ లేఖలు బయటపెడతానని బెదిరించసాగాను. నిజానికి ఆమె రాసిన ఉత్తరాలు ఏనాడో చించేశాను. ఆ విషయం తెలియని తను విపరీతంగా భయపడసాగింది. అంతలో ఓ రోజు ఆమె ఆత్మహత్య చేసుకుందని తెలిసింది. ఆ తర్వాత ఆమె విషయం మరచిపోయాను" అన్నాడు రాజేష్.

సౌదామిని నిర్దోషి అని తెలియగానే విజయ్ సంతోషపడ్డాడు. ఆ రోజు ఆమె మౌనానికి కారణం కూడా యిప్పుడు అర్థమైంది అతనికి.

'తను యీ సమస్యను మరో విధంగా హ్యాండిల్ చేసి ఉండాల్సింది. తను ఆమె ప్రియుడిని చూసిన విషయం ఆమెతో చెప్పకుండా, తనే ఎలాగో ప్లాన్ చేసి వారి మధ్య సంభాషణ విని ఉంటే ఆమె మీది అనుమానం పోవడమే కాక తను ఆమె సమస్యను పరిష్కరించి ఉండేవాడు. సౌదామిని తనకు దక్కేది' అనుకుని ఎంతో బాధపడ్డాడు.

"ఈ రోజు నిన్ను చూడగానే 'యిదివరకు ఎక్కడో చూశానే' అనుకున్నాను. తర్వాత గుర్తొచ్చింది. నీ ఫోటో మీ ఇంట్లో చాలాసార్లు చూశాను కదా. నువ్వూ నన్ను సౌదామిని ప్రియుడిగా గుర్తుపట్టావు. కాని నాలాగే గుర్తుపట్టనట్టు నటించావు కదూ" అన్నాడు రాజేష్.

"లేదు. గుర్తుపట్టలేదు. నువ్వు చెప్పేంతవరకూ నువ్వు సౌదామిని ప్రియుడని నాకు తెలియదు"

"మరి సౌదామిని ప్రియుడు మీ ఇంటినుంచి బయటకు రావడం చూశానన్నావు?"

"దూరం నుంచి చూశాను కనుక అతని రూపురేఖలు కనబడలేదు"

రాజేష్ ఆశ్చర్యంతో నోరు తెరచి "మరి... నువ్వు... కూల్‌డ్రింక్‌లో... కలిపిన విషం?" అన్నాడు.

"నువ్వు చూశావా?" అంటూ నవ్వి "సౌదామిని మరణించాక నాకు జీవితంపై విరక్తి పుట్టింది. వెంటనే ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాను. అయితే నన్ను కలవడానికి నువ్వు తప్పకుండా బాపట్ల వస్తావని నాకు తెలుసు. నిన్ను కలసి, నీతో మనసు విప్పుకుని మాట్లాడి, ఆ తర్వాత చనిపోదామనుకున్నాను. ఈ రోజు ఆ కోరికా తీరింది. అందుకే కూల్‌డ్రింక్‌లో విషం కలుపుకున్నాను. చాలా పవర్‌ఫుల్ పాయిజన్ అది. త్రాగిన పదినిమిషాలకు ప్రాణం పోతుంది. గుడ్‌బై ఫ్రెండ్ మళ్ళీ మనం వచ్చే జన్మలో కలుద్దాం" అన్నాడు విజయ్.

"అవును... వచ్చే జన్మలోనే.... కలు...ద్దాం"

రాజేష్ నోటి నుంచి ముద్ద ముద్దగా వస్తున్నాయి మాటలు.

"రాజేష్ ఏమైంది?" కంగారుగా అడిగాడు విజయ్.

"కథ అడ్డం తిరిగింది" కిందపడిపోతూ అన్నాడు రాజేష్.

□□□□□

"ఇది నీ జీవితంలో జరిగిన సంఘటనలా నాకనిపించడం లేదు. ఓ సస్పెన్స్ సినిమా చూస్తున్నట్లుంది. ఆ తర్వాత ఏమైంది?" రామానుజం అడిగాడు మిత్రుడు విజయ్‌ని.

"రాజేష్ చనిపోయాడు" బాధగా అన్నాడు విజయ్.

"మరి పోలీసులు కేసు బుక్ చెయ్యలేదా? నిన్నూ, ఆ కూల్‌డ్రింక్స్ షాపువాణ్ణి అరెస్ట్ చేసి ఉంటారే?"

"మమ్మల్ని ప్రశ్నించారు. అయితే అతను గుండె ఆగి చనిపోయాడని పోస్ట్‌మార్టం రిపోర్ట్ రావడంతో కేసు మూసేశారు"

"నువ్వు పోస్ట్‌మార్టం చేసిన డాక్టరును మ్యానేజ్ చేశావా?"

"లేదు. నిజంగానే రాజేష్ హార్ట్ ఫెయిల్యూర్ వల్ల మరణించాడు"

"నిజమా. విషం కలిపిన కూల్‌డ్రింక్ త్రాగడం వల్ల కాదా?" ఆశ్చర్యంగా అడిగాడు రామానుజం.

"కూల్‌డ్రింక్‌లో నేను కలిపింది విషం కాదు. నేను అసిడిటీకి వాడే హోమియో మందు"

"అబ్బ. నీ కథకు ఏం కొసమెరుపు యిచ్చావు విజయ్?" ఎగ్జయిట్‌మెంట్‌తో అన్నాడు రామానుజం.

"నేను రాజేష్‌ను సౌదామిని ప్రియుడిగా గుర్తుపట్టాను. అతనూ నన్ను గుర్తుపట్టాడని అతని ముఖకవళికల ద్వారా గమనించాను. అందుకే చిన్న ట్రిక్ ప్లే చేశాను. అయితే అతన్ని చంపాలన్న ఉద్దేశ్యం నాకు లేదు. నా జీవితంలో ఆనందాన్ని హరించిన అతన్ని కొంతసేపైనా భయపెడదామని అనుకున్నాను. జీవితాన్ని ఎంతో ప్రేమించే రాజేష్ తాను విషం తాగి మరణించబోతున్నాడన్న విషయం తట్టుకోలేక గుండె ఆగి మరణించాడు. పూర్ ఫెలో"

"ఎవరు చేసిన పాపం వారినే వెంటాడుతుంది. ఓ అమాయకుడి జీవితంతో ఆడుకున్నందుకు రాజేష్ ఫలితం అనుభవించాడు" అన్నాడు రామానుజం.

★

## సెక్సీభామ

**బా**లీవుడ్‌లో సెలీనాజైట్లీ ఇప్పుడు సెక్సీభామగా పేరు తెచ్చుకుంది. గ్లామర్ ప్రపంచంలో తిరుగులేని తారగా ఈమె వెలుగొందుతోంది. ఆరేళ్ళ క్రితం మిస్ యూనివర్స్ పోటీల్లో నాలుగో రన్నరప్‌గా నిలిచిన సెలీనాజైట్లీ తన పేరులోనే అందం ఉందంటోంది. ఈ మధ్య ఫ్యాషన్ షోలలో కూడా దర్శనం ఇస్తోందీ భామ. కొత్త హీరోయిన్లు ఎంత మంది వస్తున్నా , బాలీవుడ్‌లో సెక్సీభామగా కొత్త ఇమేజ్‌ని సంపాదించుకుంది.

